నిర్వహణ లేక నిరుపయోగం

● లక్ష్మీనగర్ పార్కు ఓపెన్ జిమ్ పరిస్థితి ● పట్టించుకోని జీహెచ్ఎంసీ అధికారులు

సైదాబాద్, మే 24(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్‌కాలనీ పార్కులో లక్షలు వెచ్చించి 2022 జనవరి 30న ఓపెన్ జిమ్‌ను అర్భాటంగా ప్రారంభించారు. అబ్డామినల్ రైడర్, వర్టికల్ షోల్డర్, లెగ్ ఎక్స్ ఎక్స్‌టెన్షన్, కర్ల్ మిషన్, షోల్డర్ ట్విస్టర్లు, పుల్ ఛైర్స్, చెస్ట్ పుష్ వంటివి అమర్చారు. కానీ పరికరాలు కొద్ది రోజులకే పాడైనా పట్టించుకునే వారు కరువయ్యారు. ఏర్పాటు చేసి మూడు సంవత్సరాలు గడిచినా మరమ్మతులకు నోచుకోకపోవడంతో లక్షలాది రూపాయల విలువ గల జిమ్ పరికరాలు పనికి రాకుండా పోతున్నాయి. కొత్తలో యువకులతో పాటు నడి వయస్కులు, మహిళలు ఓపెన్ జిమ్‌కు భారీగా వచ్చారు. యంత్రాలు పాడైపోవడంతో వారిలో ఆసక్తి తగ్గిపోయింది. నాణ్యత లేని పరికరాలు కావడంతో పాడయ్యాయని కాలనీ సంక్షేమ సంఘం, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఈ పార్కు జిమ్ పరికరాల మరమ్మతు కోసం జీహెచ్ఎంసీ నిధులు మంజూరు చేసి టెండర్ ప్రక్రియ చేసినా పనులు పూర్తవకపోవడంతో పలు ఆరోపణలు తల్లెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పరికరాలను మరమ్మతులు చేయించడంతో పాటు నిర్వహణపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.


లక్ష్మీనగర్‌కాలనీ పార్కులో ఓపెన్ జిమ్


మరమ్మతుకు నోచుకోని విరిగిన పరికరం

మరమ్మతులు చేయించాలి



నిర్వహణ, పర్యవేక్షణ లోపం కారణంగా సగం పైగా జిమ్ పరికరాలు తుప్పుపట్టి విరిగిపోయాయి. ఉన్న పరికరాల్లో కూడా బేరింగ్స్‌లో గ్రీజు, ఆయిల్ వంటివి వేయకపోవడంతో సరిగా పనిచేయడం లేదు. వెంటనే మరమ్మతులు చేయించాలి.

- మల్లేష్, వాకర్స్ అసోసియేషన్

పట్టించుకునే వారేలేరు



లక్షలాది రూపాయల నిధులతో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. కానీ పరికరాలు సరిగా పనిచేస్తున్నాయా, లేదా అని పట్టించుకునే వారు లేరు. దీంతో వ్యాయామం చేయడానికి ఎవరూ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదు.

- చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు, లక్ష్మీనగర్ కాలనీ సంక్షేమ సంఘం


ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇందిరమ్మ కాలనీలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే

● ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

హయత్‌నగర్, మే 24(ఆంధ్రజ్యోతి): పేదలకు అన్ని విధాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శనివారం బొంగుళూరులోని ప్రమీద కన్వెన్షన్ సెంటర్‌లో తుర్కయంజాల్ మున్సిపాలిటీకి చెందిన 390మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎప్పుడైన పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. గతంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ గ్రామ గ్రామాన ఇందిరమ్మ కాలనీలను నిర్మించి ఇచ్చిందన్నారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ డబల్ బెడ్‌రూంల పేరుతో ప్రజల ఓట్లు వేసుకుని మోసగించిందని అన్నారు. బీఆర్ఎస్ మునిగిపోయో పార్టీ అని అన్నారు. కార్యక్రమంలో తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డితో పాటు పలు శాఖలకు చెందిన అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


కార్పొరేటర్ అరుణతో కలిసి నాగోల్ బండ్లగూడలో పనులను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్

నాగోల్‌లో జోనల్ కమిషనర్ పర్యటన

మన్సూరాబాద్, మే 24(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పా టిల్ శనివారం స్థానిక కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బండ్లగూడ నుంచి శ్రావణిశ్రీ ఎన్‌క్లేవ్ వరకు కొన్ని నెలల క్రితం వేసిన వరదనీటి నాలాపై సీసీ రోడ్డు వేయలేదని, గోల్డెన్ విల్లాస్ వద్ద డీఆర్ఎఫ్ నుంచి సీఎన్‌డీ ప్లాంట్ వరకు వేస్తున్న బాక్స్‌డ్రైన్ నాలా పనులు తొందరగా పూర్తి చేయించాలని కోరారు. ఆ పనులను పరిశీలించిన జెడ్సీ సానుకూలంగా స్పందిస్తూ పనులను వెంటనే పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీ తిప్పర్తి యాదయ్య, డీఈలు కనకయ్య, నీలిమ, ఏఈ దీపక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, నాయకులు ఈటల భద్రయ్య, పాల్వాయి సంజీవరెడ్డి, లక్ష్మణ్, పంగ శ్యామ్‌కుమార్, వినోద్‌యాదవ్, రాముగౌడ్, మునీందర్ పాల్గొన్నారు.

సంతోష్‌నగర్ ఏసీపీగా సుఖ్‌దేవ్‌సింగ్



సంతోష్‌నగర్, మే 24(ఆంధ్రజ్యోతి): సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీగా విధులు నిర్వహించిన మహ్మద్ గౌస్‌ను డీజీపీ కార్యాలయానికి బదిలీ చేశారు. ఈ స్థానంలో ఇంటెలిజెన్స్ డీఎస్పీగా పనిచేసిన సుఖ్‌దేవ్‌సింగ్‌ని ఏసీపీగా నియమించారు. దీంతో సుఖ్‌దేవ్‌సింగ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల సహకారంతో ఎక్కడ ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు కృషి చేస్తామన్నారు. నగర పోలీస్ కమిష్నగర్ సీవీ ఆనంద్, సౌత్-ఈస్ట్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలో ఎక్కడ ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని ఆయన తెలిపారు.


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

హయత్‌నగర్, మే 24(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లోని భాగ్యలత అరుణోదయనగర్‌కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కాలనీ సంక్షేమ సంఘాల నాయకులతో కలిసి కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. అనంతరం కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. పద్మావతికాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డును అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో అనురక్షదయనగర్‌కాలనీలో లోవోల్టేజీ సమస్య తీరుతుందని అన్నారు. ఆయా కాలనీల్లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏఈ నాగరాజు, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు కళ్లెం శంకర్‌రెడ్డి, సామ రవీందర్‌రెడ్డి, నరసింహారెడ్డి, రాములు, అమర్‌నాథ్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, హనుమంతరెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధ్యాయ శిక్షణ

సైదాబాద్, మే 24(ఆంధ్రజ్యోతి): మలకపేట ప్రభుత్వ పాఠశాలలో ఐదు రోజుల పాటు సైదాబాద్ మండల ఉపాధ్యాయ శిక్షణ శనివారం ముగిసింది. ముగింపు వేడుకల్లో కాలడేరా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంజనేశ్వర్‌రావు ఏర్పాటు చేసిన తపాల బిల్లలు, పురాతన నాణేల ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో డిప్యూటీ ఐఎస్ఓ వరప్రసాద్‌రెడ్డి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, మండల రిసోర్స్‌పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జైలు అదాలత్‌లో 20 కేసుల పరిష్కారం

సైదాబాద్, మే 24(ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ జైలులో శనివారం నిర్వహించిన జైలు అదాలత్‌లో 20 కేసులు పరిష్కరించారు. చీఫ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ అజేశ్‌కుమార్ మూడు కేసులు, 4వ అడిషనల్ చీఫ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ స్వర్ణలత ఏడు కేసులు, 10వ అడిషనల్ చీఫ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ ప్రతాప్ 10 కేసులు పరిష్కరించి ఖైదీలకు విముక్తి కలిగించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్‌గౌడ్, అధికారులు పాల్గొన్నారు.


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి : శ్వేతారెడ్డి

సైదాబాద్, మే 24(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు వేగవంతం చేసేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి సూచించారు. శనివారం సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలో రూ11.56లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. కొందరు కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల జరుగుతున్న నిర్మాణ పనుల జాప్యంపై అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. స్పందించని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ శిరీష, స్థానికులు బొమ్మల ప్రశాంత్, విశాల్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గుడిసెవాసులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించండి

● కలెక్టర్ గౌతమ్‌కు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి విన్నపం


కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, మే 24(ఆంధ్రజ్యోతి): నాగోల్ శ్రీసాయినగర్ కాలనీలోని గుడిసెవాసులకు ఇందిరమ్మ పథకం కింద పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రూను కలెక్టరేట్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాగోల్ సాయినగర్ కాలనీలోని ఓ భాగాన 650 గుడిసెల్లో నిరుపేదలు నివాసం ఉంటున్నారని, ఆ గుడిసెల్లో అప్పుడప్పుడు సంభవిస్తున్న అగ్నిప్రమాదాలతో తమ కష్టం బూడిదపాలు కావడంతో పాటు ప్రాణనష్టం జరిగిన సందర్భాలూ ఉన్నాయన్నారు. ఇప్పటికే పట్టాలు కలిగి ఉండడంతో ఆ గుడిసెల్లో మరోసారి ఎలాంటి ప్రమాదం సంభవించినా తట్టుకునేలా పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ.. ఇందిరమ్మ ఇళ్లు కట్టివ్వాలంటే 400 స్క్వేర్ ఫూట్‌కి తగ్గి ఉండకూడదని, అయినప్పటికీ హౌసింగ్ బోర్డు ఎండీతో మాట్లాడి పక్కా ఇళ్లు నిర్మించేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్యేతో పాటు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చందు, బాధితులు ఫౌమిద, పాషా, సాహెదబేగం, యాదయ్య, శ్రీనివాసులు, రాములు ఉన్నారు.

కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి

వనస్థలిపురం : కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ గుంటి జంగయ్యనగర్ కాలనీవాసులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ కాలనీలోని విజయదుర్గాంబిక ఆలయం ఎదుట డ్రైనేజీ పొంగడంతో ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత వాటర్ వర్క్స్ అధికారి శ్రీనివాస్‌కు ఫోన్‌చేసి డ్రైనేజీ సమస్య పరిష్కారం చేయాలని ఆదేశించారు. అవసరమైతే అక్కడ నూతన డ్రైనేజీ లైన్లు వేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌రాజ్, కాలనీవాసులు గుంటి బాబారావు, నర్సింగ్, రజినీకాంత్, సతీష్‌కుమార్, సంతోష్ పాల్గొన్నారు.

'మనం సైతం-దేశం కోసం'ను విజయవంతం చేద్దాం

● బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

● నేడు దిల్‌సుఖ్‌నగర్ నుంచి ఆర్కేపురం వరకు తిరంగా ర్యాలీ


మాట్లాడుతున్న బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

మన్సూరాబాద్, మే 24(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణకు సరిహద్దుల్లో పోరాడుతున్న సైనికుల కోసం ఆదివారం చేపట్టే తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. మన్సూరాబాద్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా ప్రధాని మోదీ నేతృత్వంలో భారత సైనికులు 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాక్ ఉగ్రవాద స్థావరాలపై విజయవంతంగా చేపట్టిన దాడి యావత్ భారతావనికి గర్వకారణమన్నారు. ఇందుకు గాను ఎల్బీనగర్ అసెంబ్లీ పరిధిలోని దిల్‌సుఖ్‌నగర్‌లోని దుర్గామాత ఆలయం నుంచి ఆర్కేపురం అష్టలక్ష్మీ ఆలయ కమాన్ వరకు ఆదివారం సాయంత్రం 5గంటల నుంచి సిటిజన్ ఫర్ నేషన్ సెక్యూరిటీ వారి ఆధ్వర్యంలో 'మనం సైతం-దేశం కోసం' అను నినాదంతో తిరంగా ర్యాలీ చేపట్టనున్నామన్నారు. ఈ సమావేశంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్లు కొత్త రవీందర్‌గౌడ్, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, బండారి భాస్కర్, సురేష్, కిరణ్‌బాబు, శ్రీనివాస్, పాతూరి శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు



చాదర్‌ఘాట్ పోలీసులు అరెస్టు చేసిన నిందితుడు దీపక్‌సింగ్

చాదర్‌ఘాట్, మే 24(ఆంధ్రజ్యోతి): పేరు మోసిన అంతర్రాష్ట్ర దొంగను చాదర్‌ఘాట్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈనెల 17న చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీ చోరీ జరిగిన సంఘటన విధితమే. చాదర్‌ఘాట్ క్రైం ఇన్‌స్పెక్టర్ భూపాల్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందెడ్ ప్రాంత నివాసి దీపక్‌సింగ్ ఎలియాస్ రాహుల్‌సింగ్ ఎలియాస్ ఆజాద్‌సింగ్ ఎలియాస్ కరణ్‌సింగ్ (47) ఇళ్లలో విలువైన నగదు, నగలు దొంగతనాలు చేయడం అలవాటుగా మారింది. తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో జరిగిన దొంగతనాలతో సంబంధమున్నట్లుగా పోలీసుల విచారణలో వెల్లడైంది. నిందితుడు దీపక్‌సింగ్ ఈనెల 16న మహారాష్ట్రలోని నాందెడ్ నుంచి రైలు ద్వారా కాచిగూడకు చేరుకున్నాడు. అక్కడి నుంచి రైలు పట్టాలపై నడుచుకుంటూ మలకపేట రైల్వేస్టేషన్‌కు అదే రోజు అర్ధరాత్రికి చేరుకున్నాడు. మలక్‌పేట రైల్వే స్టేషన్‌కు ఆనుకుని ఉన్న ఆజంపుర నివాసి మహ్మద్ ఫహీముద్దీన్ ఇం టి కిటికీ తెరచి ఉండడాన్ని గుర్తించాడు. 17న తెల్లవారుఝామున 3 గంటల ప్రాంతంలో ఫహీముద్దీన్ ఇంటి కిటికీలో నుంచి లోనికి ప్రవేశించిన నిందితుడు మొదట్లో వంటింట్లో ఉన్న వంట పాత్రలను దొంగిలించేందుకు చేతికి అందిన వస్తువులను కిటికీలో నుంచి బయటికి విసిరేశాడు. అనంతరం వంటింటి నుంచి బెడ్‌రూంలోకి వెళ్లగా ఫహీముద్దీన్‌తోపాటు అతని కూతురు నిద్రిస్తుండడాన్ని గమనించి బీరువా తెరచి చేతికి అందిన బంగారు నగలు, నగదు దోచుకుని పారిపోయాడు. వెం టనే రంగంలోకి దిగిన క్లూస్ టీమ్‌తోపాటు 8 పోలీసు బృందాలు చోరీకి పాల్పడిన వ్యక్తి ఎక్కడి నుంచి వెళ్లాడనే వివరాలు ఆరా తీయగా మలకపేట రైల్వేస్టేషన్ నుంచే మరో రైలులో కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వెళ్లి అక్కడి నుంచి నాందేడ్‌కు ఇంకో రైలులో వెళ్లినట్లుగా పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా గుర్తించారు. అనంతరం సీసీ ఫుటేజీల వివరాలు సేకరించిన పోలీసులకు శనివారం దీపక్‌సింగ్ అల్వాల్‌లోని అతని సో దరుని ఇంటికి వచ్చినట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు పట్టుకుని విచారణ జరపగా ఫహీముద్దీన్ ఇంట్లో భారీ చోరీ చేసినట్లు బయటపడింది. అతని వద్ద నుంచి చేతి గడియారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన బంగారు నగలు, నగదు నాందేడ్‌లోని ఇంట్లో భద్రపరిచినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. పోలీసు కస్టడీకి తీసుకున్న వాటిని పోలీసులు రికవరీ చేయనున్నట్లు సమాచా రం. అరెస్టయిన నిందితుడు దీపక్‌సింగ్‌పై తెలంగాణ రాష్ట్రంలోని వివి ధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 10చోరీ కేసులు, మహారాష్ట్రలో ఐదు కేసులు, కర్ణాటకలో పలు కేసుల్లో ఉన్నట్లు పోలీసులు ఆరా తీశారు. తాండూరులో జరిగిన హత్యకేసుతో నిందితుడు దీపక్‌సింగ్‌కు సంబంధమున్నట్లు పోలీసుల విచారణలో బయటపడినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు దీపక్‌సింగ్‌ను అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేశారు. కేసును చాదర్‌ఘాట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గుపోసి లబ్ధిదారులతో కలిసి పనులు ప్రారంభిస్తున్న గోవర్ధన్‌రెడ్డి తదితరులు

ప్రజా ప్రభుత్వంలో పేదోడి సొంతింటి కల సాకారం

● మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి

సరూర్‌నగర్, మే 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్నివర్గాలకు సమ న్యాయం జరుగుతున్నదని, పేదోడి సొంతింటి కల సాకారమవుతున్నదని గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఇందిరమ్మ పథకంలో భాగంగా బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడలో లబ్ధిదారులకు మంజూరైన రూ.5లక్షల ఆర్థిక సాయానికి సంబంధించిన మంజూరు పత్రాలను శనివారం పార్టీ సీనియర్ నాయకుడు నవారు మల్లారెడ్డితో కలిసి ఆయన అందజేశారు. అనంతరం ఇంటి నిర్మాణానికి ముగ్గుపోసి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ లబ్ధిదారులు ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం ఇంటి నిర్మాణం చేపట్టాలని, ప్రభుత్వం అందజేసే ఆర్థిక సాయాన్ని దుర్వినియోగం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రామిడి శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మయ్యగౌడ్, శ్రీనివాస్‌చారి, శంకర్, చంద్రం, సాయి, రామకృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై విజిలెన్స్ విచారణ చేపట్టండి

సైదాబాద్, మే 24(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్‌లో మూడేళ్లుగా మంజూరైన జీహెచ్ఎంసీ అభివృద్ధి పనులపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి షేక్ మహమూద్ డిమాండ్ చేశారు. శనివారం సింగరేణి కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొందరు ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో కుమ్మక్కై పనులు చేయకుండానే నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. పనులపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేనియడల సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.


రాజ్ భూపాల్‌గౌడ్ సమక్షంలో పార్టీలో చేరుతున్న మహిళలు

బీజేపీలో మహిళలకు సముచిత స్థానం

● బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్‌గౌడ్

హయత్‌నగర్, మే 24(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీలో మహిళలకు తగిన స్థానం ఉంటుందని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ అన్నారు. శనివారం కమ్మగూడ, ఇంజాపూర్‌లోని పలు కాలనీలకు చెందిన పలువురు మహిళలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని అన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక మంది యువకులు పార్టీలో చేరుతున్నారని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో పోటీచేసి గెలుపొందాలని కోరారు. బీజేపీలో చేరిన ముత్యమమ్మ, మంజుల, ఝాన్సీ, ఈశ్వరమ్మ, సువర్ణలకు పార్టీ కండువలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బోసుపల్లి ప్రతాప్‌రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, నాయకులు బచ్చిగళ్ళ రమేష్, కందాళ బల్‌దేవ్‌రెడ్డి, పురుషోత్తం, కొత్త రాంరెడ్డి, భిక్షపతి, రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

హిజ్రా స్కూటీ దహనం


మంటల్లో కాలిపోయిన హిజ్రా స్కూటీ

హయత్‌నగర్ : హిజ్రాతో గొడవ పడి సహజీవనం చేస్తున్న వ్యక్తి హిజ్రా స్కూటీని దహనం చేసిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుంట్లూర్ వివేకానంద విగ్రహం చర్చి రోడ్డులో సంపత్ నిఖిత(ట్రాన్స్‌జెండర్) నివాసం ఉంటుంది. నాలుగు సంవత్సరాలుగా నిఖిత మన్సూరాబాద్‌కు చెందిన శ్రీనుతో సహజీవనం చేస్తుంది. అయితే అతని ప్రవర్తన నచ్చక నిఖిత 10 నెలలుగా అతడికి దూరంగా ఉంటుంది. శుక్రవారం అర్ధరాత్రి నిఖిత ఇంటికి వచ్చిన శ్రీను ఆమెతో గొడవ పడ్డారు. కుర్చీతో ఆమెపై దాడి చేశాడు. కిటికీ అద్దాలను ధ్వంసం చేశాడు. ఇంటి ముందు పార్కు చేసిన నిఖిత స్కూటీకి నిప్పు అంటించి పారిపోయాడు. దీంతో స్కూటీ మొత్తం కాలి బూడిద అయింది. నిఖిత ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేసకుని దర్యాప్తు చేస్తున్నారు.

అవయవదానంపై అవగాహన అవసరం

● అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ సీతామహాలక్ష్మి


చిత్రా లేఅవుట్ పార్కులో శరీర అవయవదానంపై అవగాహన కార్యక్రమంలో డాక్టర్ సీతామహాలక్ష్మి, రామచంద్రారావు, ఇంద్రసేనారెడ్డి

ఎల్బీనగర్, మే 24(ఆంధ్రజ్యోతి): అవయవదానంపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఎంతో అవసరమని అఖిలభారత శరీర అవయవ దాతల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ సీతామహాలక్ష్మి అన్నారు. ఆర్‌కేపురం చిత్రా లేఅవుట్‌కాలనీలో సీనియర్ సిటిజన్స్, ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్, చిత్రా లేఅవుట్ కాలనీ వాకర్స్‌క్లబ్ సంయుక్తంగా అవయవదానంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శరీర అవయవ దానంపై ప్రజల్లో ఎన్నో అపోహలు ఉన్నాయన్నారు. ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడానికి స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ యంత్రాంగాలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా సమాజంపై ఎంతో ప్రభావం చూపే మీడియా అవయవదానంపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టాలన్నారు. అవయవదానం చేయడం ద్వారా మరణించిన అనంతరం కూడా వారి అవయవాలు జీవించి ఉంటాయన్నారు. ప్రభుత్వ నిబంధనలు, షరతులు, అనుమతులతో ఎవ్వరైనా చట్టప్రకారం అవయవాలు దానం చేయవచ్చన్నారు. మరణానికి ముందు వీలునామా ద్వారా అవయవదానం చేయడానికి అవకాశం ఉందన్నారు. ప్రత్యేక పరిస్థితుల్లో బ్రెయిన్‌డెడ్ అయిన సందర్భాలలో కూడా కుటుంబ సభ్యుల అనుమతితో అవయవాలు దానం చేయవచ్చన్నారు. ఇటీవల కాలంలో విద్యావంతులు కొందరు అవయవదానం విషయంలో స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని ఇది మంచి పరిణామమన్నారు. అవయవదానంపై ఎటువంటి మూఢనమ్మకాలు పెట్టుకోవద్దని అంతా శాస్త్రీయంగా చట్టబద్ధంగా అవయవ మార్పిడి జరుగుతుందన్నారు. ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రామచంద్రరావు మాట్లాడుతూ మరణించిన వారి అవయవదానం కారణంగా ఎంతో మంది జీవితాలలో వెలుగు నింపే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, రావుల నర్సింహారెడ్డి, అంజయ్య, రజినీ, శ్రీనివాస్‌రావు, గంగాధర్‌రెడ్డి, రాఘవరెడ్డి, జనార్దన్, అంజన్‌రావు, అంబరీష్, సత్యనారాయణ, గోవర్ధన్, బాలిరెడ్డి, సబితారెడ్డి, స్వర్ణలత, వేదసంహిత, శైలజ తదితరులు పాల్గొన్నారు.